క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా దేవరాజు



చెల్లి దేవరాజు | వరసాల జాన్ ప్రభాకర్ | పులగల శ్రీనుబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఎస్సీ జిల్లా జిల్లా కమిటీలో రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురుకి పదవులు దక్కాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలను పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించడంతో రూరల్ నుంచి పదవులు దక్కిన వారిని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటరు కురసాల కన్నబాబు అభినందించారు. ఎస్సీ సెల్ జిల్లా కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా చెల్లి దైవరాజు, కార్యదర్శులుగా వరసాల జాన్ ప్రభాకర్, పులగల శ్రీనుబాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా తోకల ఏసురత్నం నియమితులయ్యారు. తమకు జిల్లా కమిటీలో స్థానం కల్పించినందుకు పార్టీ కో ఆర్డినేటరు కన్నబాబుకు అభినందనలు తెలియజేశారు.

జొన్నలగడ్డ రాజుకు సత్కారం



రాజును సత్కరిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరావు

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా అటవీశాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్న, మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజును డీఎఫ్‌వో(డిస్ట్రిక్ట్ ఫారెస్టు ఆఫీసర్) ఎస్.రామచంద్రరావు ఘనంగా సత్కరించారు. సేవా రంగంలో డాక్టరేట్ పొందిన జొన్నలగడ్డ రాజుకు అభినందనలు తెలిపారు. గురువారం మాధవనగర్‌లోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎఫ్‌వో మాట్లాడుతూ ఓ వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సేవా మార్గంలో పయనిస్తూ రాజు ఆదర్శవంతుడిగా నిలిచారన్నారు. ఆయన స్ఫూర్తిని సహోద్యోగులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టరేట్ గ్రహీత రాజు మాట్లాడుతూ సహోద్యోగులు, ఉన్నతాధికారుల సమక్షంలో డీఎఫ్‌వో చేసిన సత్కారం డాక్టరేట్‌ను మించిన ఓ అరుదైన గౌరవమని అన్నారు.

ఏపీఎస్పీ హైస్కూల్ పరిశీలన



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌క్యాంపు ప్రాంగణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టరు కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, విలువల విద్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలలో అంశాలను వివిధ స్థాయిల విద్యార్థులకు బోధించే పద్ధతి, మూల్యాంకనం గురించి సూచనలు ఇచ్చారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గాయత్రి, ఎస్‌సీఆర్‌టీ టెక్స్ట్ బుక్ రైటర్ రమేష్, కాకినాడ డీవైఈఓ కేవీవీ సత్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి, బైక్ నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి మూడు రోజులు జైలు, ముగ్గురికి రెండు రోజులు చొప్పున జైలు, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మి కుమారి తీర్పు చెప్పారు. వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో 15 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ప్రశాంతంగా పారామెడికల్ కౌన్సెలింగ్

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో గురువారం పారామెడికల్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. సెలక్షన్ కమిటీ సభ్యురాలిగా డాక్టర్ రజనీ వ్యవహరించారు. 101 సీట్లకు గాను 531 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 25 సీట్లు మినహా మిగిలిన సీట్లకు అడ్మిషన్లు పూర్తయ్యాయి. రోస్టర్ సహా, ఎస్సీ, ఎస్టీ కోటా, ఎక్స్ సర్వీస్ మన్ కేటగిరీ, దివ్యాంగుల కోటా తదితర అంశాల ప్రాతిపదికన 25 సీట్లు భర్తీ కాలేదు. వీటిని పారామెడికల్ బోర్డు మార్గనిర్దేశంతో మరో రెండు వారాలలోపు భర్తీ చేయనున్నారు. కౌన్సెలింగ్ పట్ల పలువురు విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారన్న ప్రచారాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ తీవ్రంగా ఖండించారు. పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

ఫుట్‌పాత్‌లు.. ప్రమాద ఘంటికలు!

- పాడైపోయిన ఫుట్‌పాత్‌లు
- ప్రజలకు తప్పని అవస్థలు



ఎస్పీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఫుట్‌పాత్ దుస్థితి



రంగరాయ వైద్య కళాశాల వద్ద మూతలేని మ్యాన్ హోల్



జేఎన్‌టీయూకేకు వెళ్లే దారిలో పాడైన ఫుట్‌పాత్

బోట్‌క్లబ్: నగరంలో ఫుట్‌పాత్‌లు పాడైపోయాయి. వాటిపై ఉన్న శ్లాబులు శిథిలమవడంతో అటుగా నడిచి వెళ్లేవారు, విద్యార్థులు, వృద్ధులు ప్రమాదబారిన పడుతున్నారు. పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్ వద్ద శ్లాబ్‌లు పూర్తిగా పాడైపోవడంతో ప్రజలు దానిలో పడిపోతున్నారు. ఫుట్‌పాత్‌లు పాడై నెలలు గడుస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంలేదు. స్మార్ట్‌సిటీలో భాగంగా కోట్లాది రూపాయలతో స్థానిక సర్పవరం జంక్షన్ నుంచి జగన్నాథపురం బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఈ ఫుట్ పాత్‌లు తరచూ మరమ్మతులకు గురవుతున్న కార్పొరేషన్ అధికారులకు చీమైనా కుట్టడం లేదు. కాకినాడ మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే ఈ ప్రధాన రహదారిని ప్రజలందరూ నిత్యం వినియోగిస్తారు.

కాకినాడ నగరంలో సుమారు 5 లక్షల జనాభా ఉన్నారు. వీరందరికీ మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే అధికంగా ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారిపై రద్దీగా తిరుగుతుంటాయి. దీంతో పాదచారులు రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై నడక సాగిస్తారు. ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు సుమారు 20 ప్రాంతాలలో ఫుట్‌పాత్ శిథిలావస్థకు చేరాయి. పలు ప్రాంతాల్లో అయితే మొత్తం శ్లాబు ఊడిపోయి ఉన్నాయి. ఇక్కడ గోతులు ఉన్న సంగతి తెలియనివారు నిత్యం ఆ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు

స్థానిక నాగమల్లి తోట జంక్షన్ నుంచి భానుగుడి జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఐటీఐ, జేఎన్‌టీయూకే, రంగరాయ వైద్య కళాశాల ఉన్నాయి. దీనిలో చదివే విద్యార్థులు నిత్యం ఇదే ఫుట్‌పాత్‌ల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. రెండు ప్రాంతాల వైపు నుంచి ఆయా కళాశాలకు ఇలాగే వెళుతుంటారు. ఉదయం పూట ఎలా ఉన్నా చీకటి పడితే ఇక్కడ ఫుట్‌పాత్‌లు పాడైన విషయం తెలియని విద్యార్థులు, పాదచారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు ఈ మ్యాన్ హోల్స్‌లో పడి ఆసుపత్రి పాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. రంగరాయ వైద్య కళాశాలను ఆనుకుని జిల్లా ఎస్పీ కార్యాలయం ఉంది. ఇక్కడ నిత్యం వందలాది మంది ఎస్పీ కార్యాలయానికి వస్తుంటారు. ఎస్పీ కార్యాలయానికి ఫుట్‌పాత్‌పై వెళ్లే ప్రాంతంలో కూడా పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్ పాడవ్వడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వాకర్స్‌కు తప్పని అవస్థలు

తెల్లవారుజామున వాకింగ్‌కి వచ్చే వాకర్స్ ఈ ఫుట్‌పాత్‌పై ఎక్కువగా తిరుగుతుంటారు. స్థానిక జేఎన్‌టియూకే, ప్రభుత్వ ఐటీఐ, రంగరాయ వైద్య కళాశాలల్లో ఉన్న వాకింగ్ ట్రాక్ వెళ్లేందుకు సమీపంలో ప్రజలు ఈ ఫుట్‌పాత్‌పై అక్కడకు వెళుతుంటారు. కొత్తగా వాకింగ్ వచ్చే వారు, వృద్ధులు ఫుట్‌పాత్‌లు సక్రమంగా లేవని తెలియక వాటిలో పడి గాయాలు పాలవుతున్నారు. ఇటీవల ఒక వ్యక్తి గోతిలో పడడం వల్ల అతనికి కాళు సైతం విరిగిపోయి ఆసుపత్రిలో వారంలో రోజులు ఉండాల్సి వచ్చింది. ఇలా నిత్యం ఇక్కడ అనేక ఘటనలు జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం ఇవేమి తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నిత్యం అవస్థ పడుతున్నాం



ప్రతిరోజు రంగరాయ వైద్య కళాశాల వాకింగ్ ట్రాక్‌కు మా ఇంటికి నుంచి నడిచి వెళుతుంటాను. ఈ ప్రాంతాల్లో చాలా ప్రదేశాల్లో ఫుట్‌పాత్‌లు పాడైపోయాయి. నెలలు తరబడి ఇలాగే ఉండడంతో కొత్తగా వచ్చేవారు దానిలో పడి గాయాలు పాలవుతున్నారు.

– సీహెచ్ సుబ్రహ్మణ్యం, వాకర్

జీఎస్టీ సంబరాలు ఎవరికి ఉపయోగం

బోట్‌క్లబ్: అట్టహాసంగా చేస్తున్న జీఎస్టీ సంబరాలు వల్ల పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు ఏమీ లేవని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ ధరలు చార్జీల అదనపు భారాలు తగ్గిస్తే పేద మధ్య తరగతి వారికి ఉపయోగపడుతుందని గానీ ఇలా పండగలు చేసుకోవడంల వల్ల ఎలాంటి లాభం లేదన్నారు. ధరలను తగ్గిస్తే రోజూ రెండు పూటలా నాణ్యమైన పోషకాహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. నిత్యం ఏసీలు, టీవీలు మోపెడ్లు, సెల్ ఫోన్లు, గ్రైండర్లు బట్టలు, జోళ్లు కొనుక్కోరని, వాటిపై తగ్గే జీఎస్టీ వల్ల పేదలకు ఒరిగేదీమీలేదన్నారు. నిత్యావసర వస్తువుల విషయంలో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగిపోవడంతో రవాణా వ్యయం అధికమై అన్ని వస్తువుల ధరలు అమితంగా పెరిగిపోయాయన్నారు. ముందు వాటిపై ఉన్న అధిక ధరలను తగ్గించాలన్నారు. కొనుగోలు శక్తి లేక నాణ్యత లేని కల్తీ సరకులు ఆహార వస్తువులు మార్కెట్‌లో రాజ్య మేలుతున్న పరిస్థితి ఉందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో నిజమైన సంతోషం చూడాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ విద్యుత్ రేట్లు చార్జీలు భారాలు తగ్గించాలని కోరారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం వంశీకృష్ణ

బాలాజీచెరువు: కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ జిల్లాలో వివిధ పాఠశాలలో చదువుతున్న 18 బాలికలకు గురువారం సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వంశీకృష్ణ హాజరై మాట్లాడుతూ, విద్య ప్రతి వ్యక్తి జీవితాన్ని, సమాజాన్ని మార్చుతుందన్నారు. బాలికలు విద్యను అభ్యసించడం ద్వారా కుటుంబంతో పాటు దేశానికి ప్రకాశవంతమైన భవిష్యత్ నిర్మించగలమన్నారు. బాలికల విద్యలో పెట్టుబడి పెట్టడం అంటే సమాజంలో రేపటి సమాజంలో పెట్టుబడి పెట్టడం లాంటిదన్నారు. ఎస్‌బీఐ ప్లాటినం జూబ్లీ స్కాలర్‌షిప్ ద్వారా 9నుండి 12వ తరగతి అభ్యసిస్తూ 75శాతం పైగా మార్కులు సాధించినవారికి ఆర్థిక సహాయం చేస్తున్నారని,ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.విద్యాభివృద్ధి దిశగా ఎస్‌బీఐ తరపున సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పిల్లి రమేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు పోషకాహారం వితరణ



దుప్పటి, పండ్లు పంపిణీ చేస్తున్న సుగుణ ఆమె సోదరులు

కాకినాడ క్రైం: పెదపూడి మండలం చింతపల్లిలాకు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొమ్ము జోసఫ్ 35వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె ఆర్ఎంసీ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్, విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ కొమ్ము మేరీ సుగుణ మణి గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె తన సోదరులు జాన్ క్రిస్టోఫర్, రాజ్‌కుమార్, సోదరి మేరి సుగంధ మణితో పలు కార్యక్రమాలు పూర్తి చేశారు. అందులో భాగంగా సామర్లకోట, పెద్దాపురం రోడ్డులో ఉన్న సిరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండీ క్యాప్డ్ మానసిక వికలాంగుల వసతి గృహాన్ని సందర్శించారు. 40 మంది మానసిక దివ్యాంగులకు దుప్పట్లు, పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు గోపి దేవితో మాట్లాడి రోజు వారీ నిర్వహణతోపాటు వారిని సంరక్షిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మానసిక దివ్యాంగుల సంరక్షణ కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

పంచారామ క్షేత్రంలో రైల్వే పీఆర్‌సీ ఎండీ పూజలు



పంచారామ క్షేత్రంలో రైల్వే అధికారి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే(సికింద్రాబాద్) పీఆర్‌సీ ఎండీ డాక్టరు నిర్మల రాజారామ్ కుటుంబ సభ్యులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ఉప ఆలయాలను దర్శించుకొని, స్వామి వారికి అమ్మవారికి పూజలు చేశారు. పూజలు అనంతరం ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్ గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తిలు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ నీలకంఠం వారికి ప్రసాదం, స్వామివారి ఫొటో అందజేశారు.

కార్తిక మాస ఏర్పాట్లపై రేపు సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక మాసం నెల రోజుల పాటు భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే సమయంలో వారికి చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, పట్టణ ప్రముఖులు, ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘ నాయకులు పాల్గొన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

కనువిందు



నూతన దంపతులకు 333 రకాలు వంటకాలతో మిత్రులు ఏర్పాటు చేసిన భారీ విందు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నూతనంగా వివాహం చేసుకున్న సాధ్యం ఫౌండేషన్ అధ్యక్షురాలు రాణి పద్మజ, నాగరాజు దంపతులకు కానుకగా వారి మిత్రులు అందరూ కలిసి భారీ విందు ఏర్పాటు చేశారు. స్థానిక రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్ వద్ద గురువారం 333 రకాల వంటకాలతో విందును ఏర్పాటు చేశారు. నూతన వధూవరులను ఆటపాటలతో అలరిస్తూ, వారి ఆతిథ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ వ్యవస్థాపకులు నాగేంద్ర మాట్లాడుతూ, అందరితో సరదాగా ఉంటూ కుటుంబంలో సొంత మనిషిగా కలిసిపోయే వ్యక్తిత్వంతోపాటు, సమాజానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న రాణి పద్మజ వివాహం ఎప్పటికీ మరచిపోని విధంగా ఉండాలనే ఉద్దేశ్యంతో మిత్రులు అందరూ కలిసి ఇలాంటి కానుకను అందించామన్నారు.

శృతి మించిన కూటమి సర్కార్ అరాచకాలు

- గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి



కాకినాడ రూరల్: రాష్ట్రంలో కూటమి సర్కార్ అరాచకాలు శృతి మించాయని, కల్తీ మద్యంతో పీకల లోతుల్లో కూరుకుపోయిన ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా ‘సాక్షి’పై కేసులు పెడుతోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అన్నారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ అక్కడ సమన్వయకర్తపై వ్యాఖ్యలు బాధకరమని, మహిళలపై గౌరవం ఇదేనా అని నిలదీశారు. కాకినాడలో గురువారం ఆమె ఒక ప్రకటనలో కూటమి పాలనలో అరాచాలు జరుగుతున్నాయని, ప్రజల నుంచి తగిన సమయంలో సరైనా గుణపాఠం వస్తుందన్నారు. దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందిస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో గొప్పలు తప్ప పనితీరు లేదన్నారు. మద్యం బాటిల్స్‌పై క్యూ ఆర్ కోడ్ గత ప్రభుత్వంలో ఉన్నదే అని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలపై అనుచితంగా కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారని, ఇందుకు ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలే నిదర్శనమి ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

కొత్తపల్లి డిప్యూటీ తహసీల్దార్‌పై విచారణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఉప్పాడ కొత్తపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ డీవీ మురళీకృష్ణపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎస్.మల్లిబాబు విచారణ చేపట్టారు.

భూ తగాదాలు, ఫ్యామిలీ మెంబర్ సరిఫికెట్లు ఇచ్చేందుకు , పలు విషయాల్లో డిప్యూటీ తహసీల్దార్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాసరావు ప్రజా ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఆర్డీవో విచారణ చేశారు. ఆ నివేదికను ఉన్నతాధికారులు పంపనున్నట్టు చెప్పారు.

ఆహార భద్రత దినోత్సవాన్ని మరచిన యునివర్సిటీ

బాలాజీచెరువు: ప్రతి ఏడాది అక్టోబర్ 16న ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం నిర్వహిస్తున్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆహార నాణ్యత, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల వంటి వాటిపై అవగాహన కల్పిస్తుంది.

అటువంటిది జేఎన్‌టీయూకేలో ఫుడ్‌టెక్నాలజీ విభాగం ఉన్నా కనీసం ఆహార భద్రత దినోత్సవం నిర్వహించకపోవడం విద్యార్థులను నిరుత్సాహానికి గురిచేసింది. ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో చిరుధాన్యాలు వాటి అవశ్యకతపై లఘు చిత్రం నిర్మించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తదితర సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈట్‌రైట్ క్యాంపస్‌గా ఎంపికైన జేఎన్‌టీయూకేలో ఫుడ్‌టెస్టింగ్ ల్యాబ్ ద్వారా వివిధ ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించే అత్యాధునిక ల్యాబ్‌లు ఉన్నాయి. గతంలో ఈ పరిశ్రమలు కార్యక్రమ నిర్వాహణకు పలు పరిశ్రమలతో పాటు ఆహార పదార్థాలు ఉత్పత్తిచేసే సంస్థలు స్పాన్సర్‌షిప్ కల్పించి వివిధ రకాల స్టాల్స్‌తో ఫుడ్‌టెక్నాలజీ విభాగానికి వన్నె తెచ్చేలా సదస్సు నిర్వహించేవారు. ఎన్నో మంచి విషయాలున్న ఈ క్యాంపస్‌లో ఈ ఏడాది కనీసం ఆహార భద్రత దినోత్సవం గుర్తు లేకపోవడం విడ్డూరంగా ఉంది. అయితే ఈ విషయంపై ప్రిన్సిపాల్ మోహన్‌రావును వివరణ కోరగా ఈ నెల 23 వతేదీన నిర్వహించేందు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన



గురజనాపల్లి హైస్కూలులో సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న ఆయుర్వేద డాక్టర్ దివ్య

కరప: గుండెకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు, ప్రాణాలు కాపాడేందుకు అత్యవసరంగా అందించే సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయుర్వేద డాక్టర్ బి.దివ్య అన్నారు. ఒక ప్రాణం కాపాడడం అంటే ఒక కుటుంబాన్ని నిలబెట్టడమన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సీపీఆర్ గురించి వివరించి, అవగాహన కల్పించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రిత్వశాఖ ఆదేశాలతో ఈ నెల 17వ తేదీ వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సడన్‌గా గుండె కొట్టుకోవడం ఆగిపోయినా, విద్యుదాఘాతంతో పడిపోయిన వ్యక్తులకు సీపీఆర్ చేయడం ద్వారా తిరిగి గుండె పనిచేయించి, బతికించే అవకాశముందన్నారు. ఏడు స్టెప్స్ ద్వారా సీపీఆర్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆయుర్వేద హాస్పిటల్ అవార్డు పొందిన ఆయుర్వేద డాక్టర్ దివ్యను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, యోగా టీచర్ ఎ.బాబ్జీ, స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ కె.నాగలింగేశ్వరరావు, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, ఎం.ప్రభారాణి, పి.మాణిక్యాంబ, శోభాకర్, ఎన్‌యు రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కొంగోడు పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ సీతారామశర్మ

కరప: సార్వా పంట చివరి దశలో ఉందని రైతులు అప్రమత్తంగా ఉంటూ, ప్రతి రోజూ పంటను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ ఎ.సీతారామశర్మ పేర్కొన్నారు. కొంగోడులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులతో సమావేశమై వివిధ పంటల తెగుళ్ల గురించి వివరించి, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వరి చేలు పొట్ట, ఈనిక దశలో దోమ ఆశించే అవకాశముందన్నారు. దోమలు దుబ్బుల నుంచి రసాన్ని పీల్చడం వల్ల పైరు లేత పసుపు వర్ణంలోకి మారుతుందన్నారు. వీటి ఉధృతి ఎక్కువగా ఉంటే పైరు సుడు, సుడులుగా వలయాకారంలో ఎండి పోతుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జీవన ఎరువుల గురించి వివరించారు. అనంతరం రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి వరి దుబ్బులపై దోమలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు.

ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

బాలాజీచెరువు: కాకినాడ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అపార్ ఐడీ జనరేషన్ ప్రస్తుత పరిస్థితి, ఎఫ్‌ఏ మార్కుల పెండింగ్ ఎంట్రీ విషయాలపై చర్చించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, పదో తరగతి పరీక్షల సిలబస్‌పై ఎంతవరకూ పూర్తయిన విషయాలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో ప్రవేశపెడుతున్న ఆధార్ క్యాంపులు, జాతీయ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య, మధ్యాహ్న భోజన పథక పరిస్థితి, సైన్స్ ఎగ్జిబిషన్‌కు పాఠశాలల నుంచి ప్రాజెక్టుల ఎంపిక విషయాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖకార్యాలయ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హైస్కూలులో అనధికారికంగా చెట్ల నరికివేత



పట్టుకెళ్లిపోవడానికి సిద్ధం చేసిన దుంగలు



అరట్లకట్ట హైస్కూలులో నరికేసిన చెట్లు ఇవే

కరప: అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పచ్చని చెట్లను అనధికారికంగా నరికివేశారు. నీడనిచ్చి, చల్లని గాలులనిచ్చే చెట్లు ఎటువంటి అనుమతులు లేకుండా నరికేయడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లను నాటాలని బోధించే పాఠశాలలోనే చెట్లు నరికివేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలకు ఎటువంటి అడ్డంకిలేకున్నా పెరిగిన చెట్లను నరికివేయడం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన చెట్లను తొలగించాలంటే సంబంధిత జిల్లా పరిషత్ అధికారుల నుంచి అనుమతి తీసుకుని, బహిరంగంగా వేలంపాట నిర్వహించాల్సి ఉంటుంది. అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు చెట్లు నరికేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దొంగచాటుగా చెట్లను నరికేసి, సొమ్ముచేసుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నించారని, ఇష్టం వచ్చినట్టు చేసి నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని ఇదేమి పాలన అని పలువురి ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో మిగిలిన చెట్లను అయినా కాపాడాలని, అనుమతుల్లేకుండా హైస్కూలులో పచ్చని చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.